RNI NO APTEL/2012/53127 TELANGANA VANI TELUGU DAILY
తెలంగాణ వాణి
తెలుగు దినపత్రిక The Voice of Telangana
ఆదివారం । 26 । జూలై । 2026

# విద్యార్థి పోరాటాలకు తలవంచక తప్పదు

**ధర్మేంద్ర ప్రధాన్‌కు మరో శాఖా కేటాయించే ఆలోచన**

**విరమించుకోవాలివిద్యావ్యవస్థ ప్రక్షాళన తక్షణమే జరగాలి**

**విద్యార్థుల బలిదానాలకు పరిహారం ఇవ్వాలి**

**ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి వర్క అజిత్**

కొత్తగూడెం (తెలంగాణ వాణి)



దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన నీట్, సీబీఎస్ఈ పరీక్షా పేపర్ల లీకేజీలకు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయడం విద్యార్థుల ఐక్య పోరాట విజయమని ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి వర్క అజిత్ తెలిపారు. శనివారం ఆయన ఒక పత్రికా ప్రకటన విడుదల చేస్తూ వివరాలు వెల్లడించారు. పేపర్ లీకేజీలకు నిరసనగా దేశ రాజధాని ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద విద్యార్థి లోకం నిర్వహించిన పోరాటాల దాటికి తలవంచి కేంద్ర ప్రభుత్వం దిగిరాక తప్ప లేదన్నారు. కేంద్ర విద్యాశాఖలోని నిర్లక్ష్యం వల్ల లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తు అంధకారంలోకి నెట్టబడటమే కాకుండా, మనస్తాపంతో పలువురు విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడటం తీవ్ర విచారకరమన్నారు. లీకేజీ బాధ్యుడైన ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాతో సరిపెట్టకుండా, ఆయనకు భవిష్యత్తులోనూ ఎలాంటి మంత్రిత్వ శాఖనూ కేటాయించకూడదని డిమాండ్ చేశారు. కల్తీ లేని విద్యావ్యవస్థను అందించేందుకు ప్రభుత్వం తక్షణమే ప్రక్షాళన చర్యలు చేపట్టాలని, ఈ అంశంపై పార్లమెంటు వేదికగా సుదీర్ఘ చర్చ జరగాలని కోరారు. నీట్ అక్రమాల వల్ల ప్రాణాలు కోల్పోయిన బాధిత విద్యార్థుల కుటుంబాలకు తక్షణమే రూ. కోటి నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా తమ న్యాయమైన హక్కుల కోసం శాంతియుతంగా ఆందోళనలు చేపట్టిన విద్యార్థులపై బనాయించిన అక్రమ కేసులను బేషరతుగా ఉపసంహరించుకోవాలని స్పష్టం చేశారు. పేపర్ లీకేజీల సంస్కృతిని అరికట్టేలా శాశ్వత పరిష్కారం చూపాలని, ఈ అక్రమాలపై ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్, సిపిఐ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా నిరసన ఉద్యమాలు కొనసాగించామని గుర్తుచేశారు.

# ప్రజా సమస్యలను పక్కదారి పట్టించేందుకే మత విభజన రాజకీయాలు

**మతోన్మాద, కార్పొరేట్ విధానాలపై ప్రజా పోరాటాలు చేయాలని సీపీఎం పిలుపు**

**రాష్ట్ర నాయకులు బోడపట్ల రవీందర్**

కొత్తగూడెం (తెలంగాణ వాణి)



ప్రజల దైనందిన సమస్యల నుండి దృష్టి మళ్లించేందుకే కేంద్ర ప్రభుత్వం మత రాజకీయాలు తెస్తుందని సీపీఎం రాష్ట్ర రాజకీయ విద్యా విభాగం నాయకులు బోడపట్ల రవీందర్ ఆరోపించారు. మతోన్మాద, కార్పొరేట్ విధానాలకు వ్యతిరేకంగా ప్రజా పోరాటాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. స్థానిక మంచికంటి హాల్‌లో రెండు రోజులపాటు జరిగే రాజకీయ శిక్షణ తరగతుల్లో భాగంగా మతోన్మాద, కార్పొరేట్ రాజకీయాలు అనే అంశంపై ఆయన క్లాసు బోధించారు. జిల్లా కమిటీ సభ్యులు భూక్య రమేష్ ప్రిన్సిపల్‌గా వ్యవహరించారు. ఈ సందర్భంగా బోడపట్ల రవీందర్ మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత మత విభజన రాజకీయాలు పెరిగి ప్రజలను ఉన్మాదం వైపు నెడుతున్నారని విమర్శించారు. పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు విపరీతంగా పెంచి ప్రజలపై భారం మోపుతూ దేశం కోసం, ధర్మం కోసం భరించాలి అంటూ నీతులు చెబుతున్నారని దుయ్యబట్టారు. ప్రధానమంత్రి స్థాయిలో ఉన్న వ్యక్తి ప్రజా సమస్యలకు పరిష్కారం చూపకుండా ప్రవచనాలు చెప్పడం సరికాదన్నారు. ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయిల్ యుద్ధం వల్ల ధరలు పెరిగినా అమెరికాతో అంటకాగుతున్న మోడీ యుద్ధం ఆపాలని కూడా అడగలేదని విమర్శించారు. అమెరికా ప్రయోజనాల కోసం భారత సార్వభౌమత్వాన్ని తాకట్టు పెడుతున్నారని, అమెరికా-భారత్ వాణిజ్య ఒప్పందం ద్వారా భారత్‌ను అమెరికాకు జూనియర్ భాగస్వామిగా చేసే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు. దేశంలో నిరుద్యోగం పెరుగుతున్నా పరిష్కార మార్గాలు చూపకుండా విద్యార్థులు, యువకుల ఉద్యమాలను పక్కదారి పట్టిస్తున్నారని అన్నారు. బీజేపీ ప్రభుత్వ హయాంలో రాజ్యాంగంలోని లౌకిక విలువలు, ఫెడరల్ స్ఫూర్తి, సామాజిక న్యాయంపై దాడి జరుగుతోందని, రాజ్యాంగం స్థానంలో మనుస్మృతి తీసుకొచ్చేందుకు బీజేపీ, ఆర్ఎస్ఎస్ ప్రయత్నిస్తున్నాయని ఆరోపించారు. భారత రాజ్యాంగాన్ని, లౌకిక విలువలను, మత సామరస్యాన్ని కాపాడుకునేందుకు కమ్యూనిస్టులు కృషి చేయాలని, ప్రజలపై పడుతున్న భారాలపై ప్రజలను కదిలించి పోరాటాలు చేయాలని సూచించారు. ప్రజా పోరాటాల ద్వారానే మత విభజన రాజకీయాలకు చరమగీతం పాడగలమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టౌన్ కార్యదర్శి లిక్కి బాలరాజు, కార్యదర్శి వర్గ సభ్యులు సందకూరి లక్ష్మి, నందిపాటి రమేష్, టౌన్ కమిటీ సభ్యులు విజయగిరి శ్రీనివాస్, ఆవుల శ్రీరాములు, అన్నవరపు ఇందిర, కేహెచ్ ప్రసాద్,



ఎంఎస్ ప్రకాష్, ఎం.వి నరసయ్య, కే సమ్మయ్య, గడల నరసింహారావు, రాజారావు, ఎం శ్రీను, పులిపాక వెంకటేశ్వర్లు, వై వెంకటేశ్వరావు, పద్మ, రజిత, వాణి, బాలకృష్ణ, రాములు, రఘు, నాగదుర్గ, జ్యోతి, ముతేష్ తదితరులు పాల్గొన్నారు.

# సమన్వయంతోనే పనుల్లో వేగం, పారదర్శకత విద్య, వైద్యం, పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి

**సమీక్షస మావేశంలో కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు**



కొత్తగూడెం (తెలంగాణ వాణి)

వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసినప్పుడే అభివృద్ధి పనుల్లో వేగం సాధ్యమవుతుందని కొత్తగూడెం ఎమ్మెల్యే, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు సూచించారు. కొత్తగూడెంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం మున్సిపల్ కార్పొరేషన్, విద్యుత్, నీటి పారుదల, విద్య, వైద్య, వ్యవసాయ, రెవిన్యూ, రోడ్లు-భవనాలు, పంచాయతీరాజ్ తదితర శాఖల అధికారులతో ఆయన సుదీర్ఘ సమీక్షా సమావేశం నిర్వహించారు. నియోజకవర్గంలో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనుల పురోగతిని, విద్య, వైద్యం, పారిశుధ్యం తదితర ప్రజా సమస్యలను అధికారులతో ఆయన క్షుణ్ణంగా చర్చించారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ.. ప్రభుత్వ శాఖల మధ్య సరైన సమన్వయం లేకపోతే పనుల్లో జాప్యం జరిగి సాధారణ ప్రజలకు తీవ్ర నష్టం జరుగుతుందని పేర్కొన్నారు. ముఖ్యంగా పారిశుధ్య లోపం లేకుండా చూడాలని, తాగునీరు, విద్యుత్ సరఫరాలో అంతరాయాలు తలెత్తకుండా నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. ప్రజలకు అత్యంత కీలకమైన విద్య, వైద్య రంగాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, ప్రభుత్వ బడులు, ఆసుపత్రుల్లో సౌకర్యాలను మెరుగుపరచాలని స్పష్టం చేశారు. క్షేత్రస్థాయిలో సమస్యలను గుర్తించి, వాటి శాశ్వత పరిష్కారానికి అధికారులు బాధ్యతాయుతంగా కృషి చేయాలని, ప్రజా సమస్యల పట్ల అలసత్వం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు. కమిషనర్ సుజాత, వివిధ శాఖల అధికారులు జి రంగ స్వామి, నందయ్య, మధుకర్, శ్రీకాంత్, రాజశేఖర్, నాగేంద్ర, శివలాల్, శ్రీనివాస్, విద్యానగర్ ఉప సర్పంచి వాసిరెడ్డి మురళి తదితరులు పాల్గొన్నారు.

# పదవీ విరమణ సందర్భంగా ఇద్దరు జీఎంలకు ఘన సన్మానం





**37 ఏళ్ల సుదీర్ఘ సేవలకు కొత్తగూడెం ఏరియాలో వీడ్కోలు వేడుక**

కొత్తగూడెం సింగరేణి (తెలంగాణ వాణి)

సింగరేణి సంస్థలో సుమారు 37 సంవత్సరాలు విశిష్ట సేవలు అందించిన ఇద్దరు జనరల్ మేనేజర్లకు శనివారం కొత్తగూడెం ఏరియా జీఎం కార్యాలయంలో ఘనంగా వీడ్కోలు సన్మానం నిర్వహించారు. ఈ నెల జూలై 31న పదవీ విరమణ చేయనున్న జీఎం (పర్సనల్/ఐఆర్పీఎం) కవితా నాయుడు, జీఎం (ఈ అండ్ ఎం), సెంట్రల్ వర్క్‌షాప్ దామోదరరావులను కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ ఎం. షాలేం రాజు ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ సందర్భంగా ఏరియా జీఎం ఎం. షాలేం రాజు వారికి శాలువాలు కప్పి, పుష్పగుచ్ఛాలు అందించి సత్కరించారు. వారి సేవలను కొనియాడుతూ అభినందనలు తెలిపారు. అనంతరం జీఎం మాట్లాడుతూ కవితా నాయుడు, దామోదరావు సంస్థ అభివృద్ధికి, ఉద్యోగుల సంక్షేమానికి, సమర్థవంతమైన పరిపాలనకు ఎనలేని కృషి చేశారని అన్నారు. విధి నిర్వహణలో వారి నిబద్ధత, క్రమశిక్షణ, అంకితభావం, నాయకత్వ లక్షణాలు సంస్థకు ఆదర్శప్రాయమని పేర్కొన్నారు. వారి సేవలు సింగరేణి చరిత్రలో చిరస్మరణీయంగా నిలిచిపోతాయని, పదవీ విరమణ అనంతరం ఆయురారోగ్యాలతో, కుటుంబ సభ్యులతో కలిసి సుఖసంతోషాలతో జీవించాలని శుభాకాంక్షలు తెలిపారు. కవితా నాయుడు, దామోదరరావు మాట్లాడుతూ సింగరేణిలో సేవలందించే అవకాశం లభించడం తమ అదృష్టంగా భావిస్తున్నామని తెలిపారు. విధి నిర్వహణలో సహకరించిన యాజమాన్యానికి, అధికారులు, ఉద్యోగులు, కార్మిక సంఘాల నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. సింగరేణిలో గడిపిన అనుభవాలు జీవితాంతం మరపురానివని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్.ఓ టు జీఎం ఎం. గోవిందరావు, వికెసీఎం ప్రాజెక్టు ఆఫీసర్ ఎం.వి. నరసింహారావు, ఏరియా ఇంజనీర్ వి. రామకృష్ణ, ఫైనాన్స్ ఏజీఎం బిబత్స, డీజీఎం (ఐఈడి) యోహన్, సీఎంఓఏఐ జనరల్ సెక్రటరీ ఉపేందర్, ఇన్‌చార్జ్ హెచ్‌ఓడీ (సివిల్) కె. రాజారాం, ఏరియా ఎస్టేట్స్ ఆఫీసర్ బి. తౌర్య, డీజీఎం (ఈ&ఎం) ఏరియా వర్క్ షాప్ క్రిస్టోఫర్, మేనేజర్ (ఐటి) శేష శ్రీ, డీవైపీఎం హరీష్, సీనియర్ పీఓ మజ్జి మురళి తో పాటు అధికారులు, వివిధ విభాగాల హెచ్‌ఓడీలు, ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొని పదవీ విరమణ పొందుతున్న ఇద్దరు జనరల్ మేనేజర్లకు శుభాకాంక్షలు తెలియజేశారు.

# సర్ కార్యక్రమంలో కాంగ్రెస్ శ్రేణులు ఉత్సాహంగా పనిచేయాలి

**- పీసీసీ కోఆర్డినేటర్ లింగోజీ, కొత్వాల**



పాల్వంచ (తెలంగాణ వాణి)

ఓటర్ జాబితా సవరణ సర్ కార్యక్రమంలో కాంగ్రెస్ శ్రేణులు ఉత్సాహంగా పనిచేయాలని, పార్టీకి చెందిన ఒక్కొక్క ఓటును కూడా నమోదు చేయించాలని సర్ పీసీ కోఆర్డినేటర్, కొత్తగూడెం నియోజకవర్గ ఇంచార్జి మాసనపల్లి లింగోజీ, డీసీఎంఎస్ మాజీ ఛైర్మన్, రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ డైరెక్టర్, పాల్వంచ సొసైటీ అధ్యక్షులు కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. శనివారం సర్ కార్యక్రమంలో భాగంగా కార్పొరేషన్ పరిధిలోని 1, 2, 6, 7, 9, 43, 46వ డివిజన్లలో కాంగ్రెస్ పార్టీ ఏర్పాటు చేసిన హెల్ప్ డెస్క్‌లను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్లు, కాంగ్రెస్ నాయకులు, బీఎల్ఏలతో మాట్లాడారు. ఈ సందర్భంగా లింగోజీ, కొత్వాల మాట్లాడుతూ సర్ ప్రక్రియకు ఆగస్టు 3వ తేదీతో గడువు ముగుస్తుందని గుర్తుచేశారు. గడువు ముగిసేలోపు కాంగ్రెస్ పార్టీ సానుభూతిపరుల ఓట్లన్నింటినీ నమోదు చేయించేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు కాల్వ భాస్కరావు, కొత్వాల విమలాదేవి, సీరపు సుగుణ, డాక్టర్ బి.ఎస్.రావు, మాలంపాటి భవిత, శరపా శాంత, కాంగ్రెస్ నాయకులు యర్రంశెట్టి ముత్తయ్య, చల్లగుండ్ల సుజాత, చీకటి కార్తీక్, కొండం వెంకన్నగౌడ్, నూకల రంగారావు, షేక్ ఖాజామియా, బాడిస శంకర్ రావు, గల్లు శోభన్ బాబు, కేశబోయిన కోటేశ్వర రావు, మాలంపాటి కిరణ్, సందు ప్రభాకర్, షేక్ మదార్, షేక్ బాషా, వాలపల్లి రాంబాబు, శరపా పాపారావు, రేనాటి శ్రీను, బూసి శీను, యాటా నాని తదితరులు పాల్గొన్నారు.

# జెన్కో రూ.54 వేల కోట్ల బకాయిలపై భట్టి మౌనం ఎందుకు ?

**- ఏఐటీయూసీ నేత మిర్యాల రంగయ్య ప్రశ్న**

కొత్తగూడెం సింగరేణి, (తెలంగాణ వాణి)



తెలంగాణ జెన్కో విద్యుత్ సంస్థ నుంచి సింగరేణికి రావాల్సిన రూ.54 వేల కోట్ల మొండి బకాయిల అంశంపై కొత్తగూడెంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క స్పందించ కపోవడంపై ఏఐటీయూసీ అనుబంధ సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ అదనపు ప్రధాన కార్యదర్శి మిర్యాల రంగయ్య తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. శనివారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ, ఈ నెల 23, 24 తేదీల్లో సత్తుపల్లి, కొత్తగూడెం, మణుగూరు సింగరేణి ఏరియాల్లో ఉప ముఖ్యమంత్రి పర్యటించడం స్వాగతించదగ్గ విషయమేనని, అయితే సింగరేణి ఆర్థిక పరిస్థితికి అత్యంత కీలకమైన జెన్కో బకాయిల అంశాన్ని సమీక్ష సమావేశంలో ప్రస్తావించకపోవడం నిరాశ కలిగించిందన్నారు. జెన్కో నుంచి రావాల్సిన రూ.54 వేల కోట్ల బకాయిలను కనీసం విడతల వారీగా అయినా చెల్లించేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. దీంతో సింగరేణి సంస్థ ఆర్థిక స్థిరత్వం బలోపేతం అవుతుందని పేర్కొన్నారు. అలాగే సత్తుపల్లి అవంతిక ప్రాజెక్టు, మణుగూరు డిప్‌సైడ్ బ్లాక్, కోయగూడెం బ్లాక్, ఇల్లందు జేకే-5 ఎక్స్‌టెన్షన్ బొగ్గు బ్లాక్‌లను సింగరేణికే కేటాయించేలా రాష్ట్ర ప్రభుత్వం చొరవ చూపాలని కోరారు. దీనివల్ల బొగ్గు ఉత్పత్తి పెరగడంతో పాటు వేలాది మంది కార్మికుల ఉపాధి భద్రపడుతుందని తెలిపారు. రాంపురం గనిని మైన్ గ్యాసిఫికేషన్‌కు అనుకూలంగా గుర్తించి వెంటనే ప్రారంభించాలని, ఇది సింగరేణి భవిష్యత్తుకు ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. మెడికల్ బోర్డుకు దరఖాస్తు చేసుకున్న ప్రతి కార్మికుడికి ఇన్వాలిడేషన్ మంజూరు చేయాలని ఆయన కోరారు. గుండె శస్త్రచికిత్సలు చేయించుకున్నవారు, పక్షవాతం మరియు ఇతర తీవ్రమైన అనారోగ్యాలతో బాధపడుతున్న కార్మికుల పరిస్థితిని మానవతా దృక్పథంతో పరిశీలించి వారికి ఇన్వాలిడేషన్ కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వం, సింగరేణి యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. గత ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన లాభాల వాటా (ప్రాఫిట్ షేరింగ్) ప్రకటన కోసం కార్మికులు ఎంతోకాలంగా ఎదురుచూస్తున్నారని, వెంటనే లాభాల వాటా ప్రకటించి కార్మికులకు చెల్లించాలని మిర్యాల రంగయ్య కోరారు.

# విద్యార్థుల ఐక్య పోరాట ఫలితమే ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా

**విద్యార్థుల సుదీర్ఘ పోరాటానికి దిగొచ్చిన ప్రభుత్వం**

**పేపర్ లీకేజీ బాధిత కుటుంబాలకు తగిన పరిహారం ఇవ్వాలి**

**విద్యా వ్యవస్థ ప్రక్షాళనపై పార్లమెంట్‌లో సుదీర్ఘ చర్చ జరగాలి**

**విద్యార్థులపై మోపిన అక్రమ కేసులను ఎత్తివేయాలి**

**సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా**

కొత్తగూడెం తెలంగాణ వాణి)



నీట్, సీబీఎస్ఈ పరీక్షా పేపర్ల లీకేజీలకు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయడం విద్యార్థుల ఐక్య పోరాట విజయమని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా అన్నారు. శనివారం ఆయన ఈ మేరకు ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు. దేశ రాజధాని ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద 49 రోజులుగా విద్యార్థులు నిర్వహించిన మిలిటెంట్ పోరాటాల ఫలితంగానే కేంద్ర ప్రభుత్వం దిగిరాక తప్పలేదని తెలిపారు. భవిష్యత్తులో ఇలాంటి పేపర్ లీకేజీ సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని, రాజీనామా చేసిన ధర్మేంద్ర ప్రధాన్‌కు మరొక శాఖను కేటాయించవద్దని డిమాండ్ చేశారు. దేశంలో విద్యావ్యవస్థను సమగ్రంగా ప్రక్షాళన చేయాల్సిన అవసరం ఉందని, దీనిపై పార్లమెంటులో సుదీర్ఘ చర్చ జరగాలని ఆకాంక్షించారు. నీట్ పేపర్ లీకేజీ సంఘటనల వల్ల తీవ్ర మనోవేదనకు గురై ఆత్మహత్యలు చేసుకున్న విద్యార్థుల కుటుంబాలకు తక్షణమే రూ. కోటి చొప్పున నష్టపరిహారం చెల్లించాలని కోరారు. అలాగే విద్యా రక్షణ కోసం, తమ హక్కుల కోసం ఆందోళనలు చేపట్టిన విద్యార్థులపై పోలీసులు బనాయించిన అక్రమ కేసులన్నింటినీ కేంద్ర ప్రభుత్వం భేషరతుగా ఉపసంహరించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

# ఉపాధ్యాయ సమస్యలపై డీఈఓతో టీఎస్టీటీఎఫ్ చర్చలు



**- 17శాతం హెచ్ఆర్ఏ, జనగణన గౌరవభృతి, అదనపు టీచర్లపై వినతి**

కొత్తగూడెం (తెలంగాణ వాణి)

టీఎస్టీటీఎఫ్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా విద్యాశాఖ అధికారిని కలిసి వివిధ ఉపాధ్యాయ సమస్యలపై వినతి పత్రం అందజేశారు. ఈ క్రమంలో వారి ప్రధాన డిమాండ్లను వివరించారు. కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిని నిర్ధారించి ప్రభుత్వ గెజిట్‌లో తెలిపిన విధంగా, పీఆర్సీ నిబంధనల ప్రకారం 17% హెచ్ఆర్ఏ ఇవ్వాలని కోరారు. కార్పొరేషన్ పరిధిలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు, ఉద్యోగులకు 17 శాతం హెచ్ఆర్ఏ అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. గతంలో పాల్వంచ, సుజాతనగర్ మండలాలకు కార్పొరేషన్ హోదా లేదని, సుజాతనగర్‌కు మున్సిపాలిటీ హోదా కూడా లేదని గుర్తుచేశారు. కావున కార్పొరేషన్ పరిధిని నిర్ధారించి ప్రభుత్వ నిబంధనల ప్రకారం అన్ని పాఠశాలలకు 17% హెచ్ఆర్ఏ ఇప్పించాలని కోరారు. దీనిపై డీఈఓ స్పందిస్తూ సంబంధిత పై అధికారులకు విషయాన్ని తెలియజేసి 17% హెచ్ఆర్ఏ ఇచ్చే అవకాశాలను పరిశీలించి న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. జనగణన విధుల్లో పాల్గొన్న ఉపాధ్యాయులకు రావాల్సిన గౌరవభృతిని త్వరగా అందజేయాలని, వారికి సంపాదిత సెలవులు మంజూరు చేయాలని కోరారు. ఈ విషయంపై త్వరలోనే ఆదేశాలు జారీ చేస్తానని డీఈఓ తెలిపారు. ఉపాధ్యాయుల తాత్కాలిక సర్దుబాట్లలో నేటి వరకు కొన్ని పాఠశాలల్లో విద్యార్థుల నమోదు పెరిగిందని, అందుకు అనుగుణంగా ఉపాధ్యాయులను కేటాయించాల్సిన అవసరం ఉందని తెలిపారు. అలాంటి పాఠశాలలను గుర్తించి అదనపు టీచర్లను కేటాయించి విద్యార్థులకు న్యాయం చేయాలని కోరారు. దీనిపై డీఈఓ స్పందిస్తూ తక్షణమే అన్ని మండలాల ఎంఈఓలకు ఆదేశాలు జారీ చేసి, యుడైస్‌లోని వివరాల ప్రకారం రిపోర్టు తెప్పించుకొని అవసరమైన చోట అదనపు టీచర్లను కేటాయిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో టీఎస్టీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బానోత్ రాములు, టీఎస్టీటీఎఫ్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షుడుభూక్య మోహన్ రాథోడ్, జిల్లా ప్రధానకార్యదర్శిసభావత్‌బాలకృష్ణచౌహాన్ పాల్గొన్నారు.